# సంఘసేవాభిలాష

## ఇల్లిందల సరస్వతీదేవి

గంట సాయంకాలం ఐదున్నర. అప్పటికే కళారాణి స్కూలు నుంచి వచ్చిన పిల్లలకు టిఫిన్ పెట్టి పాలు తాగించి, ఆడుకోవటానికి పంపించింది. తీరికగా హాల్లో కుర్చీలో అరచేతిలో ముఖం చేర్చుకుని, ఆలోచనల వలయంలో చిక్కుకుని, దానిలోనుంచి బయటపడలేకపోతున్నది. రెండు నెలల క్రిందటి వరకూ సాధారణంగా ఆఫీసు నుంచి సాయిరామ్, పిల్లలు స్కూళ్ళ నుంచీ అరగంటతేడాలో ఇంటికి చేరేవారు.

ఆరోజు జరిగిన వింతలూ విశేషాలతో నవ్వుల గలగలలతో మెల్లగా టేబుల్ దగ్గర్నుంచి లేచేవారు.

కాని - ఇప్పుడు?

అలా జరగటంలేదు. అతడు కాఫీ టిఫిన్ ఆఫీసుకే తెప్పించుకుని రాత్రి ఎనిమిదింటికిగాని ఇంటికి రావటంలేదు.

ఆఫీసులో పని ఎక్కువయిందా?

ఇన్స్పెక్షనులాంటి దేమయినా జరుగుతోందా?

అయితే ఇన్నాళ్ళా?

ఏమిటీ అధిక శ్రమకు కారణం?

ఉండబట్టలేక అడిగిందొకరోజున.

"అటువంటిదేంలేదు. నా పని మామూలు వేళకయిపోతుంది". బట్టలు మార్చుకుని, కాళ్ళూచేతులూ కడుక్కుని లోపలికి వచ్చాడు సాయిరామ్. భార్య కూర్చునే కుర్చీ దగ్గరికి.

"అయితే ఎక్కడికి వెళ్ళుతున్నారు?"

"ఏదో పని"

"ఆ ఏదోపని రోజూ ఉంటుందా?"

"ఆ! ఉంటూనే ఉంటుంది."

కళారాణి సర్దుకుపోయే మనిషికాదు. తను వేసిన ప్రతి ప్రశ్నకూ సరైన సమాధానం రాబట్టనిదే ఆమె మనసు శాంతించదు.

"ఏమిటో ఆపని? ప్రతిరోజూ ఆఫీసుపని మాదిరిగా చేసేది?"

"అదా? ఆఫీసు పనికంటె ముఖ్యమైనది. ఆఫీసుకు ఆలస్యంగా వెళ్ళినా క్షమాపణ చెప్పుకోవచ్చు. సెలవు పెట్టవచ్చు. అటూఇటూ అయినా సర్దుకోవచ్చు. కాని దానివేళ ఖచ్చితమైనది. దీనికి సెలవంటూలేదు."

అతడు చెప్పేతీరును బట్టి కళారాణి ముఖం కందగడ్డలా అయింది. కడుపులో ఉక్రోశం కళపెళలాడింది.

"అయితే - అది నేను కూడా తెలుసుకోకూడదనంతటి రహస్యమా?"

"రహస్యమవునో కాదో ఎవరివాళ్ళ మనస్తత్వాన్నిబట్టి ఉంటుంది. భోజనం పెడితే తిని పడుకుంటాను!! తువాలు తీసుకుని బల్లదగ్గర కుర్చీలో కూర్చున్నాడు.

కలవారి యింటినుంచి వచ్చిన కళారాణికి ఆమాట చురుక్కుమన్నది. "భోజనం చేద్దామా?" అనే మృదువైన మాట ఇదివరలో అతడి నోటినుండి ఆప్యాయంగా వెలువడేమాట. పిల్లలు భోజనం చేశారా?" వాత్సల్యపూరితమైన మరొక పలకరింపు దానికి జోడించేవాడు. ఇప్పుడు కొత్తగా "భోజనం పెడితే తిని పడుకుంటా" నంటున్నాడు. ఎవరెటుపోయినా సరే - తన ఒక్కడి సంగతీ మాట్లాడుతున్నాడే? ఇదేమి స్వార్థం ఈనాడు?

ఆ సంగతి అతడికి తెలిసివచ్చేట్టుగా - "సరేలెండి. మీకొక్కరికే ముందుగా వడ్డిస్తాను."

అతడు మాట్లాడకుండా భోజనంచేసి పడకగదిలో అడుగుపెట్టాడు.

ఆ ఊరు నగరంకాని పట్టణంకాని మధ్యరకంగా ఉండే ఊరు. ఆ ఊరు కొత్తగా వచ్చినప్పుడు ఏమీ తోచటంలేదని బాధపడుతూ ఉండేది కళారాణి. తామిది వరకు ఉండివచ్చిన ఊళ్ళో, ఎవరో మహిళా మండలొకటి పెట్టారు. దానిలోచేరి బట్టలు కుట్టటం, నైలాను తాళ్ళతో సంచులల్లటం, పూసలతో సంచులు తయారుచేయటంలో నేర్పరి అయింది. ఇక్కడ అటువంటివి ఒక్కటయినా లేదే అనుకుంది. క్రమంగా ఇరుగుపొరుగులతో పరిచయం చేసుకుని ఇక్కడ అటువంటివి లేవుగాని ఒక క్లబ్బు ఉందని తెలుసుకుంది. దానిలో ఇంటా బయటా ఆడుకునే ఆటలున్నాయన్నమాట మాత్రమే విన్నది. అవయినా చాలు కాలక్షేపాని కనుకుంది.

సాయిరామ్ కూడా క్లబ్బుల్లోచేరి పేకలాడి తాగుడు కూడా మొదలు పెట్టాడేమో? లేకపోతే ఏమిటీ అతడి వైఖరి? ఆయన ప్రోగ్రాములు ఇట్లాగే వుంటే తనుమాత్రం ఊరికే కూర్చోటం ఎందుకు? తనూ క్లబ్బులో చేరితే?

నిశ్చయించుకున్నట్టుగా ఇరుగుపొరుగులతో వెళ్ళింది. వాళ్ళు ఆ క్లబ్బులో మెంబర్లుకారు. ఒకరోజు చూసివచ్చింది. ఆటలయినా ఆడుకోవచ్చుననుకుంది. మరో రెండు రోజులయిన తరువాత సాంఘిక కార్యకలాపాలమీద ఒక సమావేశం జరిగింది. అక్కడికి వచ్చిన వారందరితో పరిచయమయింది. అలా ఒకటిరెండు సమావేశాలకు కూడా హాజరయింది.

ఒకనాడు - "ఈఊళ్ళో నాకింత కాలక్షేపమూ ఇంత సరదాగా సంతోషంగా రోజులు గడుస్తాయనుకోలేదండి. మీలాంటి చదువుకున్నవాళ్ళూ, విజయగారి వంటి సంఘసేవా పరాయణులూ, ప్రసూనగారివంటి సాంఘికస్పృహగల స్త్రీజనాభ్యుదయకరమైన రచయిత్రులూ ఇక్కడుంటారని ఊహించనైనాలేదు. అదీగాక - ఇలా ఒక క్లబ్బు ఉంటుందనీ, వారానికొక మంచి విషయమ్మీద ఒక ప్రముఖవ్యక్తిచేత ఉపన్యాసాలిప్పిస్తారనీ, గోష్ఠులు నడిపిస్తారనీ, మెంబర్లంతా ఇంత ఉత్సాహంతో పనిచేస్తారనీ కలలోకూడా అనుకోలేదు" సంబరంగా చెప్పుకుంటూ పోతోంది కళారాణి నైలెక్సు నీరె కుచ్చిళ్ళు సర్దుకుంటూ.

ఆమె మాటలకు పొంగిపోయి, కించిత్గర్వంతో ఓరగా చూసింది కోమలి.

"ఏదయినా కృషిచేస్తే కానిదేముంది? నేనూ సరళా నిర్విరామంగా కష్టపడి



దానిని నెలకొల్పాము. మొదట ఏమీతోచక - ఎలా నిర్వహించాలో తెలియక ఊరంతా తిరిగాము. కలెక్టరుగారి కరుణగారికి ఈ విషయమంతా చెప్పి అధ్యక్షురాలిగా ఎన్నిక చేసుకున్నాము.'' అమ్మా 'మీరే ఉన్నారన్నిటికీ' అని కాస్త ఉబ్బించగానే ఆమె పొంగిపోయి కావలిసినదల్లా సమకూరేటట్టు చేసింది. తన భార్యకు అధ్యక్షురాలిని చేయగానే కలెక్టరుగారు క్లబ్బు బాధ్యతనంతా పైన వేసుకుని, అరఎకరం భూమి ఇప్పించారు. భవనం కట్టడాలకు తగిన ధనసహాయం చేశారు. మరికొంతమంది చేత చేయించారు. వాళ్ళు బదిలీ అయివెళ్ళేటప్పటికి కొన్ని పనులు మిగిలిపోతే ఆ తరువాత వచ్చిన కలెక్టర్లు నలుగురూ పూర్తిచేశారు.''

''మొత్తానికి శాశ్వతమయిన పనికి పూనుకున్నారు.''

''కట్టడాలయితే ఏర్పడ్డాయి. కాని - సాంఘిక సేవాదృక్పథంతో, సేవాభావంతో పనిచేసేవాళ్ళను సంపాదించలేక పోతున్నాము.''

''మీరు పనిచెప్తే కళ్ళకద్దుకుని చేస్తారు. అన్నిటికన్నీ సిద్ధంచేసిన తరువాత పనిచేయటానికే ముందండీ?''

'మీరు భవనమంతా ఒకసారి చూద్దురుగాని రండి. ఎవరొచ్చినా పనిచెయ్య రండీ. సంఘసేవంటే చిత్తశుద్ధితో పనిచెయ్యాలి. జీవితాలను అంకితం చేయాలి. ఇది మాటలతోకాదు. చేతలతో నిరూపించుకోవాలి.''

కళారాణిని వెంటబెట్టుకుని భవనమంతా చూపించింది. ఇటు మూడూ-అటు మూడూ పెద్దపెద్ద గదులూ, మధ్యగా పెద్దహాలు, భవనానికి నాలుగు పక్కలా విశాలమయిన వరండాలు, గాలీవెలుతురూ బాగా ప్రసరించటానికి వీలుగా పెద్దపెద్ద కిటికీలూ ఉన్నాయి. భవనం ఎత్తైన ప్రదేశంలో ఉండటంవల్ల ఊరంతా కనబడుతూ ఉంటుంది. పాతికమెట్లు దిగితేనేగాని నేల కాలికి తగలదు.


ఇద్దరూ కిందికి దిగివచ్చారు. భవనానికి ఎడమ ప్రక్కగా ఉన్న టెన్నిస్, బాడ్‌మింటన్, వాలీబాల్, రింగ్ మొదలయిన బహిరంగంగా ఆడే ఆటలూ, వాటికి చేసిన వసతులూ, భవనం ముందర కంటికింపుగా ఉన్న పూలతోటా చూపించి, కుడిప్రక్కకు దారితీసింది.

''ఇటు ఇంకేమయినా ఉన్నాయా?'' కళారాణి ఆటలకుగాను ఏర్పాటుచేసిన వసతులు చూసి, తను స్పోర్ట్సులోకూడా ప్రజ్ఞ సంపాదించాలని ఉవ్విళ్లూరింది.

''ఇటే ముఖ్యమైనవి ఉన్నాయి'' అంటూ తురాయి చెట్టుతో కప్పబడిన విశాలమయిన షెడ్డులోకి తీసుకువెళ్ళింది. ఆ షెడ్డు రెండు భాగాలుగా విభజింపబడ్డది. ఒక్కొక్క భాగంలో పాతికేసి మంచాలువేశారు. ఒక భాగంలో స్త్రీలు-ఒక భాగంలో పురుషులు. దిక్కులేనివారు - ఇళ్ళల్లో వసతిలేనివారు - ఇలా అనేకరకాల పరిస్థితులుగల వృద్ధులు ఉన్నారు.

''ఇది హాస్పిటలా?'' అన్నది కళారాణి.

''దిక్కులేని వాళ్ళూ, ఒంటరిగాళ్ళూ - అనారోగ్యంతో బాధపడేవాళ్ళూ ఉన్నారు. వీళ్ళనిక్కడ చేర్చుకుని, డాక్టరు సలహాలతో మందులిస్తాము. వీళ్ళను చూడటానికి ఇద్దరు నౌకర్లు ఉన్నారు. మా సభ్యురాలు డాక్టరుగా హాస్పిటల్లో



పనిచేస్తారు. ఆమె వాళ్ళను ఇక్కడచూసి అవసరమయితే హాస్పిటల్లో చేర్చుకుంటారు. దాని పర్యవేక్షణకు మరొక సభ్యురాలు రేవతిగారు అంగీకరించారు. ఆఖరిచివరగా - అంటే భవనం వెనుకగా చిన్నపిల్లలకు స్కూలు ఉంది. ముఖ్యంగా వాళ్ళు మురికి పేటలనుంచి వస్తారు. వాళ్ళకు అన్నం బట్టలూ ఇక్కడ ఇస్తాము. ఇళ్ళలో వసతిలేనివాళ్ళు ఇక్కడే చాపలు వేసుకుని పడుకుంటారు. తెల్లవారిన తరువాత ముఖాలు కడుక్కొని స్నానాలుచేసి, భోజనాలు ఉదయం ఎనిమిది గంటలకల్లా చేస్తారు.'' భవనం చుట్టూ తిరిగి మెట్లెక్కి ఇద్దరూ లోపలికి వచ్చారు.

హాల్లో తగిలించిన పెద్దపెద్ద ఫోటోలు కళారాణి దృష్టినాకర్షించాయి. వాటి వంక అదేపనిగా చూస్తూ నిలబడిపోయింది.

''ఆహా! ఇక్కడ వాటిని చూస్తున్నారా?'' అన్నది కోమల. ఒక ఫొటోలో సరళా కోమలా సంయుక్త కార్యదర్శినులు ఇల్లిల్లూ తిరిగి ఆ కుటుంబాలతో పరిచయం చేసుకుని, వాళ్ళ కష్టసుఖాలు తెలుసుకుంటున్నారు. వృద్ధులకు వసతులు సరిగా ఉన్నాయో లేదో చూస్తున్నారు.

రెండవది మురికివాడలలోని పరిస్థితులను చూస్తుంటే ఇంటి కప్పులు సగం లేచిపోయి, బొంగులు కనబడుతున్నాయి. ఇళ్ళపక్కన మురికి గుంటలూ, వాటిలో పొరలాడే పందులూ కుక్కలు చిన్నపిల్లలూ, దోమలూ, కుక్కిమంచాలలో కళ్ళు గుంటలుపడి ఎముకల గూడులాంటి దేహాలతో చిరుగుల గుడ్డలు కప్పుకుని మూలుగుతూ ముడుచుకుని పడుకున్న వృద్ధులూ - వాళ్ళమధ్య బుజాలమీద చేతులువేసి ఆప్యాయంగా పలకరించే కార్యదర్శినులు సరళా కోమలా ఉన్నారు.

దిగ్భ్రాంతితో చూస్తోంది కళారాణి.

''ఆ ఫొటోలను చూస్తున్నారుకదూ? ఎలా ఉన్నాయి? వాటినే విదేశాలకు పంపిస్తాము ప్రతీఏటా. అదిసరే. ఈ సమాజంలో చేరేవారందరూ పాతిక రూపాయలైనా విరాళమిచ్చి సభ్యులుకావాలి. ఈ ఫోటోలు పత్రికలో మొదటి పేజీలో పడిన రోజున ఇరవైమంది సభ్యులుగా చేరారంటే నమ్మండి. ప్రతి సభ్యురాలూ నెలకు రెండురూపాయల చందా ఇవ్వాలి. ఇక్కడ జరిగే కార్యకలాపాలలో ఏదో ఒకదానిలో విధిగా పాల్గొనాలి. శ్రద్ధగా ఓపికతో ఆఫీసువర్కు చేసినట్టు చెయ్యాలి. మీకేశాఖ ఇష్టం చెప్పండి. దేనిలో అభిరుచి?'' కోమల రిజిష్టర్లో పేరు రాయటానికి కలం చేతిలోకి తీసుకుంది.

పని చెయ్యాలనగానే ఉలిక్కిపడింది కళారాణి.

''మీరిప్పుడే నాపేరు రాయకండి. బాగా ఆలోచించుకుని, ఒకటిరెండు రోజులలో చెప్తాను. ఇంత కృషి చేస్తున్న మీ ఇద్దరినీ ఎలా అభినందించాలో తెలియటంలేదు'' అన్నది కళారాణి చేతులు జోడిస్తూ.

కోమలా సరళా కలిసి కొంతసేపు ఆఫీసు పని చూసుకున్నారు. వారిద్దరికీ చెప్పి కళారాణి ఇల్లు చేరుకుంది. ఆమెకు ఆరోజంతా ఒకటే ఆందోళన. గేమ్సు చూస్తే క్లబ్బులో చేరాలన్న ఆరాటం కలుగుతోంది. మురికివాడలలోని పిల్లలను చేతులు పట్టుకుని పిల్లలనొక్కొక్కరినీ డాక్టరికి చూపించే సంఘసేవికలు ఆకర్షణీయమైన పోజుల్లో ఫొటోలు తీయించుకుని పత్రికలలో వేయించుకుంటే చూసి తానూ అలా ఫొటో తీయించుకోవాలన్న సరదాగానూ ఉంది. కాని ఆ పిల్లలను చేత్తో పట్టుకోవటమంటే తనకు ఒళ్ళు గగుర్పొడిచినట్టుంది. పాఠశాల సెక్షను చూడ టానికి బాగానే ఉంది. కాని తానా సెక్షనులో చేరి భరించలేదు. ఆ పిల్లలతో వేగలేదు. టీచర్లు చేసే ఆరోపణలను విచారించలేదు. ఆ పిల్లల గోల - టీచర్ల అరుపులూ భరించటం తనవల్లకాదు.

వృద్ధుల ఆశ్రమంలోకూడా పెద్దపెద్ద వాళ్ళు వచ్చినప్పుడు వాళ్ళను పలకరిస్తున్నట్టూ, తలలమీద చేతులువేసి నిమురుతూ ఫొటోలు తీయించుకోవాలన్న ఉబలాటం ఉంది. ''వృద్ధులకూ అనాథలను ఆదరంతో పలకరిస్తున్న కరుణామయులు''అని పత్రికల్లో పెద్దక్షరాలతో పడుతుంటే ఎంత గొప్పగా ఉంటుందన్న ఆశగానూ ఉంది. క్లబ్బులో ఫొటోలను చూసినప్పుడు తన మనసెంత పులకరించిందో? కాని—

ఆ వృద్ధులున్న షెడ్‌లోకి తొంగిచూడటానికే తనకు చెగటనిపించింది. కళ్ళులేని వాళ్ళూ, కాళ్ళువిరిగినవాళ్ళూ కదలలేనివాళ్ళూ ఎన్నోరకాలవాళ్ళున్నారు. అక్కడ అన్నం తినలేనివాళ్ళకు దగ్గరుండి ఆయాలచేత కబుర్లు చెబుతూ నవ్విస్తూ తినిపించాలి. బట్టలు మార్పించాలి. స్నానాలు చేసేవారికి దగ్గరుండి చేయించాలి. అశక్తతవల్ల కలిగిన అసంతృప్తితో కోపతాపాలతో అరిచే వాళ్ళను శాంతపరచాలి. వాళ్ళ దీనవదనాలలో సంతోషం వెల్లివిరిసేలా హాస్యాలాడాలి. ఇవన్నీ చేయాలట. ఈ పని తనవల్ల అవుతుందా? అసలే తనకు చిరాకు. రోగులంటేనే తనకసహ్యం. వాళ్ళను చూస్తే కడుపులో వికారం.

మరి - క్లబ్బులో పనిచెయ్యాలంటే దేనిలోనో ఒకదాంట్లో పనిచేయాలట. ఎట్లా?

కళారాణికి ఈ క్లబ్బు సమస్యకాక - భర్తతో ఒక సమస్య వచ్చిపడ్డది. ఈ ఊరికి వచ్చిన తరువాత అతడు చాలా మారిపోయాడు. ఎంత ఆలోచించినా ఆమెకు అంతుచిక్కటంలేదు.

ఒకనాడు ఆఫీసునౌకరు వచ్చినప్పుడు ''అయ్యగారు సాయంత్రం తరువాత ఎక్కడుంటార''ని గుచ్చి గుచ్చి అడిగింది.

''టిఫిన్ కాఫీ అయినాక స్కూటరుమీద ఎటో వెళ్ళిపోతారండి. మధ్యాహ్నం కూడా ఒకసారి అలా బయటికెళ్ళి వస్తారండి'' అన్నాడు తలవంచుకుని తప్పు చేసినట్టుగా.

''ఎక్కడికి వెళ్తారో చెప్పగలవా?''

''తెలుసుకోవాలండి''

''తెలుసుకునిచెప్పు.'' రెండు రూపాయలు చేతిలోపెట్టింది.


అమ్మగారిచ్చిన లంచంతో మరునాటికల్లా వార్తలు చేరాయి - ''పాతపేటలో ఉన్న ఒకపూరింట్లోకి వెళ్తున్నాడనీ, ఆ యింట్లో ఒక తల్లీకూతుళ్ళు ఉంటున్నార'' న్నీను.

ఆ సంగతి వినగానే కళారాణి మనసు పరిపరి విధాలపోయింది. మనసంతా వికలమయింది. ఆ తరువాత ఈర్ష్యతో మండిపోయింది.

భార్యభర్తల మధ్య అది మొదలుకొని మూగయుద్ధం మొదలయింది. ఆఫీసు వేళకు వంటకాదు. ప్రతిరోజూ పిల్లలకు స్కూల్లో లేట్‌మార్కు. ఎప్పుడు చూసినా బయటికి వెళ్ళటానికి సిద్ధంగా ఉండే కళారాణి వెలిసిపోయిన పాతచీరెలు కడుతోంది. రెండు రోజుల కొకసారి తలదువ్వటం మొదలుపెట్టింది. శుచిశుభ్రతలతో కళకళలాడే ఇల్లు ఇప్పుడు ఏమూలచూసినా బట్టలు, ఇల్లంతా చింపిన కాగితాలూ - గిన్నెలతో చిందరవందరగా ఉంటున్నది.

ఈమధ్య కళారాణికి క్లబ్బు సెక్రెటరీ సరళ ఒక ఉత్తరం రాసింది. 'అర్జంట్' అన్నట్టు, వెంటనే క్లబ్బుకు వచ్చివెళ్ళవలసిందని, కళారాణి వెళ్ళగానే కుర్చీలో కూర్చోబెట్టి సాదరంగా పలకరించి ''మీరు క్లబ్బులో చేర్తే పనిచెయ్యాలని చెప్పాంకదా. ఇప్పుడు వృద్ధుల శాఖను చూసే సభ్యురాలు తల్లికి జబ్బుగా ఉన్నదని ఊరికి వెళ్ళుతున్నది. స్కూలును చూసుకునే సభ్యురాలికి జ్వరం వస్తోంది. ఇప్పుడు చాలా క్లిష్టమైన పరిస్థితి క్లబ్బుకి. ఢిల్లీనుంచి సంఘ సంక్షేమాధికార్లు మన సంస్థను






చూడటానికి వస్తున్నారు వచ్చేవారంలో. మీరు మాకు ఈ సహాయం చేయాలి. మిమ్మల్ని బాధించాలని కాదు. మాకు సమయానికి ఆదుకోవాలని కోరుతున్నామని'' చేతులు కట్టుకుంది.

కళారాణి ముఖంలో వినగానే కళతప్పింది. కాని సర్దుకుంది. కళారాణికి కొంచెము మార్పుకావాలనిపిస్తోంది ఈ మధ్య. 'సరే'నని తలఊపుతూ ''నాకీ ఛాన్సు ఇచ్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది. రేపే వచ్చిచేర్తా''నని చెప్పి వచ్చింది.

మరునాడు ఇంటిపనులూ పిల్లలపనులూ గబగబా చేసింది. పదిగంటల నుంచి ఒంటిగంట వరకూ ఉండి అక్కడి పనిచూసుకుని ఇంటికివచ్చి రెండుగంటలకు వెళ్ళి నాలుగుగంటలకి తిరిగి వస్తుంటే సరళ చెప్పింది - రేపటినుంచీ ఇంకా కొంచెం ముందుగా రావాలని. కళారాణి వెనుకాడలేదు. ఇంటి పనులలో సర్దుబాటు చేసుకుని క్లబ్బుకు వెళ్ళుతున్నది.

కార్యదర్శులిద్దరూ క్లబ్బులెక్కలన్నీ తయారుచేయటంలో మునిగిపోయారు. కొందరు నౌకర్లు క్లబ్బంతా బూజులు దులిపి శుభ్రంచేస్తున్నారు. క్లబ్బుకు రంగులు వేసేవాళ్ళు వచ్చి ఒకపక్క రంగులూ సున్నాలూ వేస్తున్నారు.'' ఢిల్లీనుంచి వచ్చిన కమిటీ లెక్కలు ఆడిట్ చేసి అన్నిశాఖలు పర్యవేక్షిస్తారు. వాళ్ళు పరీక్షిస్తుంటే ఫొటోలు తీస్తారు. ఆ ఫోటోలు మళ్ళా విదేశాలకు పంపుతారు విరాళాలకోసం'', ఇదంతా కార్యదర్శులు చెప్పారు.

కళారాణి ఏదయినా పనిచేయదలచుకున్నదంటే ఎవరూ వంకపెట్టలేనట్టుగా చేస్తుంది.

పిల్లలను ఆదరంతో పలకరించి హితవచనాలు చెబుతోంది. పిల్లలచేత ప్రార్థన శ్లోకాలు చెప్పించటం - అడిగిన దానికి తడుముకోకుండా జవాబులిచ్చేటట్టు శిక్షణను దగ్గరుండి ఇప్పిస్తోంది. అధికారి రాగానే అంతా నిలబడి నమస్కరించమని ఆదేశాలిస్తోంది. వృద్ధరోగులపట్ల ఆదరంగా చూస్తోంది. ఆప్యాయంగా రోగిని పలకరించటం అలవరుచుకుంది. వాళ్ళను బ్రతిమిలాడి అన్నం తినిపిస్తున్నట్టుగా ఒక ఫొటో తీయించుకుని ఆషెడ్‌లో పెట్టించింది. మురికివాడలకు వెళ్ళి, వాళ్ళ భుజాలమీద చేతులువేసి, ఆప్యాయంగా కష్టసుఖాలు అడుగుతున్నట్టుగాను - దగ్గరగా తీసుకుని ఒక్కొక్కరినీ డాక్టరుకు చూపించి మందులిప్పిస్తున్నట్టుగాను ఫొటోలు తీయించుకుని పిల్లల క్లాసురూమ్‌లో పెట్టించింది.

కార్యదర్శులిద్దరూ ఆమెచేసిన పనులను ఆమోదించినట్టు సంతోషించారు. అధికారులు వచ్చినప్పుడు కార్యదర్శులతోపాటు అన్ని శాఖలలోను ఫొటోలు వాళ్ళతోపాటు తీసుకున్నారు. అధికారులు ఎంతో సంతోషించినట్లు కనబడ్డారు. వాళ్ళరాకను గమనించి పత్రికా విలేఖరులు కూడా వచ్చి క్లబ్బంతా చూసి ఫొటోలు సేకరించటమేకాక తాముకూడా కొన్ని ఫొటోలు తీసుకున్నారు.

ఒకనాటి ఉదయాన కొన్ని పేపర్లు ఆ క్లబ్బు చరిత్రను ఫొటోలతో సహావేసి చాలా గొప్పగా పొగిడాయి. వృద్ధులను ఆప్యాయంగా పలకరిస్తున్నట్టుగా ఒక్కొక్కరి గురించీ వివరాలు డాక్టరుతో చెప్తున్న కళారాణి, స్టెతస్కోపుతో డాక్టరు, సంస్థను చూడటానికి వచ్చిన విజిటర్లూ, దాతలూ ఒకవరసలో నిలబడగా కార్యదర్శులు ఇద్దరూ మరొక వరసలో నిలబడిన ఫొటో ఒకటీ, కళారాణి మురికివాడలలోని పిల్లలను ఆప్యాయంగా ఎత్తుకుని డాక్టరుకి చూపిస్తున్న ఫోటో వివరాలతోసహా పేపర్లో వచ్చింది. దానిలో కళారాణి అలలతో ఎగిసెగిసి పడుతున్న నీలిరంగు సముద్రంలాంటి రంగుచీరెతో అందరికంటె ప్రముఖంగా కనబడే పోజులో వచ్చింది.

కళారాణి ప్రముఖ సంఘసేవికగా పత్రికా పాఠకుల దృష్టిలో చోటుచేసుకుంది. అప్పటినుంచీ ఆమె మాటలో నడవడిలో కట్టూ బొట్టులలో చాలా మార్పు, ఒకరకమైన హుందాతనం కనబడుతు వచ్చింది. పిల్లలతో ఇంట్లో ఉన్నా ఎవరో ఫొటోగ్రాఫరు వచ్చినట్టూ తనను ఫొటోతీస్తున్నట్టు ఆమెకు అనిపించటం మొదలుపెట్టింది.

ఈమధ్య ఉత్సాహపు పొంగులూ ఆమెలో కలిగిన మార్పులూ సాయిరామ్ గమనిస్తూనే ఉన్నాడు. నవ్వుతూ ఎదురుగా వచ్చిన కళారాణిని చూసి ఆశ్చర్యంతో కనుబొమలు పైకెత్తి ఏమిటీ మార్పు అన్నట్టు చూశాడు.

''నీవు ఇంత సంతోషంగా ఉండటం ఈమధ్య చూడలేదు. ఏమిటి విశేషం?'' అడిగాడు. ఆమెను చూడగానే కళ్ళు మిలమిల్లాడాయి.

''నాసంగతి వివరించటానికి మీకు తీరిక ఎక్కడుంది? ఈమధ్య మీరు పేపర్లుకూడా చూస్తున్నట్టులేదు. ఆఫీసు, ఊరిచివర ఇల్లూ - ఈరెండే మీకు ముఖ్యము.''

మనసు చివుక్కుమన్నది సాయిరామ్‌కు. అయినా కళారాణి తెచ్చి ముందర పడేసిన పేపరు కటింగ్సు చూశాడు. ఆమె ఒక్కొక్కటే వేలుపెట్టి చూపిస్తుంటే కళ్ళుపెద్దవి చేసుకుని మరీమరీ చూశాడు. వివరాలు చెప్తుంటే ఆశ్చర్యంతో విన్నాడు.

''నీ మనసు ఇంత విశాలమెప్పుడయింది? నీ అసహ్యాలన్నీ ఎప్పుడు పోయ్యాయి?''

''ఆరోగ్యాలు సరిగ్గాలేక - పలకరించే దిక్కులేక - ఆప్యాయతగా చూడవలసిన వారు ఇంట్లో చీదరించుకుంటుంటే అక్కడచేరిన వాళ్ల వాళ్ళందరూ. ఆ వృద్ధులను చూస్తుంటే మనసు ద్రవించిపోతుందండి. ఆ మురికి పేటల్లో పందులతో కుక్కలతో బురదగుంటల్లో ఈదులాడే ఆ పిల్లలను చూస్తుంటే జాలితో మనసు నిండిపోతుంది. కడుపుకు ఆహారంలేక ఉసూరోమనే వాళ్ళు, రోగాలతో తీసుకునేవాళ్ళు, కళ్ళూ కాళ్ళూ లేనివాళ్ళు తిరుగాడుతూఉండే ఆ మురికిపేటలు ఎప్పటికయినా బాగవుతాయా' అన్న ఆలోచనలు వస్తాయి. ఇటువంటి సమాజాలు ఎన్ని ఉన్నా చాలవనిపిస్తోంది'' ఎంతో అనుభవంతో చెప్పినట్టు వివరంగా ముఖంపెట్టి అన్నది కళారాణి.

ఐదునిమిషాలయింది. ఆఫొటోలనే చూస్తూ ఆలోచిస్తున్నాడు సాయిరామ్.

''మాట్లాడకుండా ఫొటోలనే చూస్తున్నారేమిటి? మీ మనసులో వాళ్ళపట్ల జాలికలగటంలేదా? మనసమాజంలో దిక్కూ దివాణంలేని ఆ ప్రజానీకాన్ని పట్టించుకునేది ఎవరు? మనదేశం ఎంత దుస్థితిలో ఉందో గ్రహించే వారెవరు? వాళ్ళుకూడా మనుష్యులేనని వాళ్ళకోసం కృషి చేసేవారెవరు?'' ఉపన్యాసధోరణిలో మాట్లాడుతోంది కళారాణి.

''నీకు మీక్లబ్బువాళ్ళు మంచి శిక్షణ ఇచ్చినట్టున్నారు. సమాజంలో ఎన్నిరకాల మనుష్యులున్నారో బాగా తెలుసుకున్నావు. వాళ్లకేంకావాలో గ్రహించావు. స్వార్థం లేకుండా మానవసేవ చేస్తున్నావు'' అన్నాడు సాయిరామ్.

''ఆలస్యంగానైనా గ్రహించారు'' అన్నది కినుకతో. ఇంతకాలం నుంచీ తెలిసి కోర్లేదన్న ఎత్తిపొడుపుతో.

"అందరికి బుద్ధినిశతంగా ఉంటుందా? బుద్ధి మాంద్యము ఉన్నవాళ్ళను క్షమిస్తూ ఉండాలి. నీకిది తెలియదనికాదు చెప్పేది. నేనివాళ ఇంత తొందరగా ఎందుకనుకున్నావు ఇంటికి వచ్చింది? నీతో అలా బయటికి తిరిగి వద్దామని. తొందరగా బయలుదేరు" అన్నాడు ఉత్సాహం తెచ్చుకుంటూ.

"పదండి!" ఐదునిమిషాలలో రెడీ అయివచ్చింది కళారాణి.

ఇద్దరూ స్కూటరుమీద బయలుదేరారు. ఆమెను కబుర్లలో పెట్టి పాత పేటలో ఉన్న ఆ చిన్నపూరింటికి తీసుకువెళ్ళాడు. తడకలతో కట్టిన గేటును తెరిచి లోపలికి తీసుకువెళ్ళాడామెను.

కళారాణి ఆ కొత్త పరిసరాలను వింతగా చూస్తున్నది.

"ఈమె అనాథకాదు. వృద్ధాప్యంలో పక్షవాతం వచ్చి బాధపడుతోంది. తన చేత్తో అన్నం తినలేదు. కుడి పార్శ్వాన్ని కదలించలేదు. మాట్లాడుతుందిగాని మనకర్థంకాదు. దానికితోడు కళ్ళుసరిగా కనబడవు. ఎవరయినా ఆప్యాయంగా పలకరిస్తే ముఖమ్మీద సంతోషం కనబడుతుంది. ఎవరూ పలకరించకపోతే బాధ పడుతున్నట్టుగా ఉంటుంది ముఖం." మంచం దగ్గరగా ఉన్న స్టూలుమీద ఆమెను కూర్చోమని, తానొక స్టూలును దగ్గరగా లాక్కున్నాడు.

కొంచెంసేపు అటూ ఇటూ చూసి "ఎప్పుడైనా ఎవరయినా చూడ్డానికి వస్తుంటారా? కొంచెం ఈ గదిని ఫొటోలతో ఆకర్షణీయంగా అలంకరించాలి. ఈ సంవత్సరం మాకు విదేశాలనుంచి పెద్దమొత్తంలో విరాళాలు వస్తాయనుకుంటు న్నారు. ఒక అందమయిన బిల్డింగొకటి కట్టించి ఇటువంటి వాళ్ళను దానిలోకి మార్చాలనుకున్నాము. మీరు చేయాల్సిందేమిటంటే పబ్లిసిటీ. పదిమంది పెద్ద వాళ్ళనెవరినైనా పిలిచి కాస్త డాబుసరి మాటలు చెప్పి ఫొటోలు తీయించి గోడలకు తగిలించండి. రకరకాల సువాసనలు వెదజల్లే పూలచెట్లతో రంగు రంగుల తురాయి చెట్లతో కప్పబడిన ఈ చిన్నయిల్లు చాలా అందంగానూ, చల్లగానూ ఉంది. కాస్త లోపల రంగులు వేయించితే ఇంకా బాగుంటుంది. దీనికి నిర్వాహకు లెవరయినా ఉన్నారా? అప్పుడప్పుడు దానిని గురించి సచిత్రవ్యాసాలు పత్రికలలో వ్రాయించండి. మీరేం చెయ్యనక్కర్లేదు. పత్రికా విలేఖరులను పిలిపించండి. అంతా వాళ్ళే చూసుకుంటారు" నాలుగు మూలలా కలయజూసి తన ఐడియాస్ చెప్తూపోతోంది కళారాణి.

సాయిరావ్‌కు అలలు అలలుగా నవ్వొస్తోంది. ఆపుకోలేకపోతున్నాడు.

"ఎందుకా నవ్వు? ఏపని చేయటానికయినా ఒక పద్ధతంటూ ఉంటుంది. అయినా నిర్వాహకులు కనిపించరేం? ఒకే ఒక మంచమా? ఇంకా ఎంతోమంది ఉన్నారు ఊళ్ళో. ఇంకా రెండు మంచాలయినా పడతాయి" అనుభవంతో చెప్పినట్లు చెప్పింది కళారాణి.

అంతలో కాలు ఈడ్చుకుంటూ ఒకావిడ వడ్డించిన పళ్ళెం, మంచినీళ్ళతో వచ్చి మంచానికి అవతలపక్క స్టూలుమీద పెట్టింది. సాయిరావ్ చేతులు కడుక్కుని ఆమెకు మొదట కొద్దిగా మంచినీళ్ళు గొంతులోపోసి, అన్నం మెత్తగా పిసికి ఆకు కూరతోచేసిన పులుసువేసి ఆ పలచటి పదార్థాన్ని చెంచాతో ఆమె గొంతులో పొయ్యటం మొదలుపెట్టాడు. పూర్తిగా పెట్టిన తరువాత, మరికొన్ని మంచినీళ్ళు ఇచ్చి ఒక గ్లాసెడు మజ్జిగ పోశాడు ఆమెగొంతులో. ఒక చిన్న తువాల తడిపి ఆమె పెదవులూ ముఖం తుడిచాడు.

ఆమె ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. ఒక చేత్తో అతడి తలను నిమిరింది.

"కాంతం! ఇవన్నీ తీసేసి తుడిచిపెట్టు. వెంకమ్మ వస్తుందిగా. జాగ్రత్తగా తలుపులు వేసి పడుకోండి" అని ఆమెతో చెప్పి, భార్యవైపు తిరిగి "కళా ఇంక వెళదాం పద" ఇంటికి బయలుదేరాడు. ఆమె దారిలో ఏమీ మాట్లాడలేదు. భోజనాలయిన తరువాత చెప్పటం మొదలుపెట్టాడు.

"కళా నీకు చూపించింది అనాథశరణాలయమూ కాదు. నిరాశ్రయుల కేర్పరచిన వృద్ధుల నివాసమూకాదు. ఆమె నాకు ఏడేళ్ళప్పుడు తల్లిపోతే పెంచిన పినతల్లి. విస్తళ్ళుకుట్టి, హోటల్లో ఇడ్లీపిండి రుబ్బి తన కూతురితోపాటు నన్నూ పెంచింది. నేను కష్టపడి చదువుకున్నాను. వారివారి దానధర్మాలతో పైకి వచ్చాను. మంచి ఉద్యోగంలో చేరగానే పై ఆఫీసరుగారు ఎవరూలేని ఒంటరి గాడినని కూతుర్నిచ్చి కొండమీద పెళ్ళిచేశారు. ఆమెను నాతో ఉంచుకునే అదృష్టం ఎట్లాగూ లేదు. అంత్యదశలో నాతల్లిలా పెంచిన ఆమెకు నా శక్తిమేరకు సౌకర్యాలు కల్పించి ఆమెకు శాంతి చేకూర్చడమే నా ధ్యేయం. ఆమెకు అడుగడుగునా ఆప్యాయత కావాలి ఈదశలో. ఆమెకోసం నా తాపత్రయం. అంతేకాని పత్రికలలో ప్రకటనలుగాని విలేఖరులు ఫొటోలు ఆమెకెందుకు? అవి ఉన్నంత మాత్రాన ఆమెకు ఆప్యాయతా సానుభూతీ లభిస్తుందా? నీవు చెప్పినవన్నీ సమాజాలకూ సంఘాలకూ పేరు ప్రతిష్ఠలు ఆశించేవారికి కావాలి. నాకు పేరు ప్రతిష్ఠలు అక్కర్లేదు. పిన్ని ముఖంలో సంతోషం కనబడాలి. అదే నాకు కావలసింది" అని భోజనం ముగించి పడగ్గదిలోకి దారితీశాడు.

అతడు ఆమెను ఆప్యాయంగా పలకరించటం కబుర్లు చెప్పటం, భోజనం తినిపించటం, స్వయంగా ఆగదిలో ఒక మూలకు సాంబ్రాణిపొగ పెట్టడం కళారాణి తనకళ్ళతో చూసింది. ఆమెలో ఈర్ష్యలాంటి ఒక జ్వాల ఉవ్వెత్తున లేచింది. అతడిది పేద కుటుంబమనగానే ముక్కు ముడతలుపడింది. రుసరుస లాడుతూ పెళ్ళిలగదిలోకి దారితీసింది సంఘసేవాభిలాషగల కళారాణి.

